క్లుప్తంగా

నేడు మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం

పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం సాయంత్రం పొదలకూరు మండలంలోని మర్రిపల్లి, కొనగలూరు, రామాపురం, దుగ్గుంట, పెదరాజుపాళెం, ఊట్లపాళెం, కొత్తకంభాలపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి ఆదివారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు ప్రసన్నకుమార్‌రెడ్డి రోడ్ షో

కోవూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక సాలుచింతల పెట్రోల్ బంక్ వద్ద నుంచి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రోడ్ షో ప్రారంభమవుతుందని ఆ పార్టీ నేతలు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కోవూరు నియోజకవర్గ పరిశీలకుడు బల్లి కళ్యాణ్ చక్రవర్తి హాజరవుతారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సోమిరెడ్డికి భంగపాటు తప్పదు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

మనుబోలు: వరుస షాక్‌లతో టీడీపీ కునారిల్లుతోందని, రానున్న ఎన్నికల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి భంగపాటు తప్పదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వీరంపల్లి గ్రామానికి చెందిన 12 టీడీపీ కుటుంబాలు మాజీ సర్పంచ్ జట్టి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని మంత్రి కాకాణి క్యాంప్ ఆఫీస్‌లో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి కాకాణి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పి బోల్తా పడి వ్యక్తి గాయపడిన ఘటన వెంకటాచలం మండలంలోని కాకుటూరు సమీపంలో ఆదివారం జరిగింది. వివరాలు.. గూడూరు పట్టణానికి చెందిన మురళీధర్ పనినిమిత్తం బైక్‌పై నెల్లూరుకు బయలుదేరాడు. కాకుటూరు సమీపానికి చేరుకోగానే బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మురళీధర్‌కు గాయాలు కావడంతో స్థానికులు చికిత్సనిమిత్తం ఆయనను నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రిపై దాడి చంద్రబాబు పనే

కోవూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు పనేనని, ఈ దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్సుయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని ప్రతిపక్షపార్టీలు ఆయనపై దాడి చేయించడం మంచి పద్ధతి కాదన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీలు ఇలాంటి నీచపు పనులు మానుకోకపోతే ప్రజలే వారికి బుద్ధి చెబుతారని తెలిపారు. కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ దాడి జరిగిందన్నారు. అనంతరం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనగా చంద్రబాబు చిత్రపటాలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, యువ నాయకులు సాయి యశ్వంత్‌రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు చిరంజీవి, సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బిడ్డను ఆదరించండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కోవూరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న గిరిజన బిడ్డ అయిన తనను ఆదరించాలని యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్రాధ్యక్షుడు కేసీ పెంచలయ్య కోరారు. నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25న తాను నామినేషన్ వేస్తున్నానని, గిరిజన, దళితులు పెద్దసంఖ్యలో వచ్చి తనను ఆశీర్వదించాలని కోరారు. సంఘ చైర్మన్ రాపూరు కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు మురళి పాల్గొన్నారు.

చంద్రబాబు.. కరువు కవల పిల్లలు



మండపం పంచాయతీలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న స్థానికులు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: చంద్రబాబునాయుడు.. కరువు కవల పిల్లలని, ఆయన ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ప్రజలు కరువుతో అల్లాడాల్సిందేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఈదూరు, మండపం, మాచర్లవారిపాళెం గ్రామాల్లో ఆదివారం మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఈదూరుకు చేరుకొన్న మంత్రికి స్థానిక నాయకుడు టంగుటూరు పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు గజ నిమ్మకాయల దండతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మండపం గ్రామంలో మంత్రి కాకాణికి స్థానిక నాయకుడు కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అపూర్వ స్వాగతం లభించింది. తదుపరి మాచర్లవారిపాళెంలో స్థానిక నాయకుడు నెలవాయి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు తన హయాంలో రాష్ట్రంలో అవినీతి, రాక్షస పాలన కొనసాగించారని దుయ్యబట్టారు. 2014 ఎన్నికల్లో వందల సంఖ్యలో హామీలిచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటీ నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా వంచించారని గుర్తుచేశారు. అలాంటి నమ్మకద్రోహి చంద్రబాబుకు మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నట్టేట ముంచేస్తారన్నారు. నాలుగు దఫాలు సర్వేపల్లి ప్రజల తిరస్కారానికి గురై అడ్డదారిన మంత్రి పదవి పొందిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాడు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అనేక అవినీతి అక్రమాలతో వందల కోట్ల రూపాయలు దోచేశారని గుర్తుచేశారు. కరోనా విపత్తు సమయంలో తాను ప్రజల వెన్నంటి ఉంటే.. సోమిరెడ్డి తనకు ఎక్కడ కరోనా సోకుతుందోనని ఇతర రాష్ట్రాల్లో తలదాచుకున్నారని తెలిపారు. అలాంటి సోమిరెడ్డికి సర్వేపల్లి ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. రాష్ట్రంలో మరోసారి ఈ ప్రజారంజక పాలన రావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సర్వేపల్లి నియోజకవర్గం నుంచి మరోసారి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుండాల వంశీకృష్ణారెడ్డి, ఎండీకళ్ల దయాకర్‌గౌడ్, ఇనకళ్ల వేణు, సుధాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, హేమేంద్ర, మోచర్ల మధు, సుధీర్, కైలాసం గోపి, ప్రవీణ్, చింతల శ్రీను, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రాజీనామాలు.. వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన గమళ్లపాళెం వాసులు



వైఎస్సార్‌సీపీలో చేరిన పాటూరుకు చెందిన వలంటీర్లు

కోవూరు: తాము నిస్వార్థంగా చేస్తున్న సేవకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు రాజకీయ రంగు పులమడాన్ని వలంటీర్లు జీర్ణించుకోలేక ఆ పోస్టుకు రాజీనామా చేస్తున్నారు. కోవూరు నియోజకవర్గంలో ఆదివారం 30 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వీరంతా నెల్లూరులోని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల మతాలు, పార్టీలు, వర్గాలు చూడకుండా తాము నిష్పక్షపాతంగా ప్రజలకు సేవ చేశామని తెలిపారు. విడవలూరు మండలం చౌకచర్ల పంచాయతీకి చెందిన 13 మంది వలంటీర్లు, కోవూరు మండలం పాటూరు పంచాయతీకి చెందిన 17 మంది వలంటీర్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, చౌకచర్ల ఎంపీటీసీ సభ్యుడు అనపల్లి ఉదయభాస్కర్, కొమ్మిరెడ్డి మురళిరెడ్డి, ఏడుకొండల శశిరెడ్డి, కొల్లు చిన్నవెంకయ్య, అత్తిపల్లి అనుప్‌రెడ్డి, కవరిగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గమళ్లపాళెంలో..

రాష్ట్రంలో సంక్షేమ పాలన చూసి కోవూరు మండలం గమళ్లపాళేనికి చెందిన అన్నం రమేష్, కుదుముల శివకుమార్, తాతా శ్రీనివాసులు, మన్యం సుధాకర్, నరమల వెంకటరమణమ్మ, అన్నం సుధాతోపాటు దాదాపు 50 కుటుంబాలు ఉయ్యూరు వేణు ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు నెల్లూరులోని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గీతారెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజలకు మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని ఆ పార్టీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, కోడలు పూజారెడ్డి కోరారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 16 వార్డులో ఆదివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కోవూరు ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, అగ్నిమాపకశాఖ అధికారి

పొదలకూరు: అగ్నిమాపక సిబ్బంది సామాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని తహసీల్దార్ కె.వీరవసంతరావు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ పాల్గొని కరపత్రాలను విడుదల చేశారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ వ్యాపారులు అగ్నిమాపక చట్టాలను తెలుసుకుని నిబంధనల ప్రకారం వ్యాపారాలు చేయాలని సూచించారు. గతంలో ముంబై ఓడరేవులో షిప్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో అసువులు భాసిన అగ్నిమాపక సిబ్బందికి నివాళిగా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ వరకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సిబ్బంది పట్టణంలో అగ్నిమాపక వాహనంతో ర్యాలీ నిర్వహించారు. అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నం, రాంనగర్ గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి ఆదివారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మొత్తం 90 కుటుంబాలవారు టీడీపీని వీడగా.. మంత్రి వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నెల్లూరులోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి కాకాణి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను చూసిన టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డికి డిపాజిట్ కూడా దక్కదన్నారు.

దాడులు సరికాదు



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మనుబోలు: విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆగంతకులు రాయితో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా కార్యదర్శి బోలా శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన మనుబోలులో మాట్లాడుతూ ఎన్నికల క్షేత్రంలో రాజకీయ ప్రత్యర్థులను రాజ్యాంగబద్ధంగా ఎదుర్కోవాలే తప్ప దాడులు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విద్వేషాలు మంచివి కావన్నారు. ప్రజల మనస్సు చొరగొని విజయం సాధించాలే తప్ప ఇలాంటి దాడుల ద్వారా కాదన్నారు. అలాగే మనుబోలులో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, గుంజి రమేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో జరిగిన దాడి పిరికిపంద చర్య అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని ప్రతిపక్ష టీడీపీ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోందన్నారు. ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

సీఎంపై దాడి అమానుషం

తోటపల్లిగూడూరు: విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి అమానుషమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ అన్నారు. ఈ దాడిని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఆదివారం స్థానిక మండల కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకరయ్యగౌడ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సుయాత్రకు వస్తున్న అపూర్వ స్పందన చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు కుట్రపూరితంగా ఈ దుశ్చర్యకు పాల్పడ్డాయన్నారు. కార్యక్రమంలో నెల్లూరు ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మన్నెం చిరంజీవులుగౌడ్, నాయకులు ఎంబేటి సంధ్యారాణి, మునలి పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అమ్మ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు ఆదివారం అన్నదానం చేశారు. రంగనాయకులపేట, పెన్నానది సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న అనాథలు, పేదలు, వృద్ధులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు రమేష్‌బాబు, సభ్యులు వంశీ, కార్తికేయ, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీరామకథా సప్తాహం



నెల్లూరు(బృందావనం): పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రేబాలవారివీధిలోని పీటీజీ రాజ్ టవర్స్‌లో నిర్వహిస్తున్న శ్రీరామ కథా తరంగిణి సప్తాహంలో భాగంగా నాల్గో రోజు ఆదివారం కిష్కింధకాండంపై రామానుజాచార్యులు ఉపన్యసించారు. సీతామాత అన్వేషణలో శ్రీరామలక్ష్మణులు పంపాసరోవరం చేరడం, హనుమంతుని ఆగమనం, సుగ్రీవ మైత్రి, వాలీ సంహారం, సీతామాత అన్వేషణకై ప్రణాళిక, తదితర విషయాలను ప్రవచించారు. అనంతరం రామానుజాచార్యులను పద్యసారస్వత పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, చీమకుర్తి వెంకటేశ్వరరావు సత్కరించారు.

క్రీడలతో ఆరోగ్యం



వీరి చలపతిరావును సత్కరిస్తున్న గుణశేఖర్ దంపతులు

• డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు

కొడవలూరు: క్రీడలతో ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంటారని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం చలపతిరావును శాలువా, జ్ఞాపికతో కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.అనిల్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మంత్రి కుమార్తె ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పూజిత

ముత్తుకూరు: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత ముత్తుకూరు పట్టణంలో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లతో ఆమె మాట్లాడుతూ తన తండ్రిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ముత్తుకూరును మంత్రిగా తన తండ్రి ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. ఆమె వెంట ఎంపీపీ గండవరం సుగుణ ఉన్నారు.

బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి



వెంకటాచలం: వీఎస్‌యూలో..



తోటపల్లిగూడూరు: ఇస్కపాళెంలో..



పొదలకూరు: తహసీల్దార్ కార్యాలయంలో..

వెంకటాచలం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఆదివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఆర్.ప్రభాకర్, బీవీ సుబ్బారెడ్డి, విద్యా ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలులో..

మనుబోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మనుబోలు ఎస్సీ కాలనీ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక దళిత నాయకులతోపాటు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

తోటపల్లిగూడూరు మండలంలో..

తోటపల్లిగూడూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం తోటపల్లిగూడూరులోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగించారు. ఇస్కపాళెం, మహాలక్ష్మీపురం గ్రామాల్లో అన్నదానం చేశారు.

పొదలకూరు మండలంలో..

పొదలకూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివబాలకృష్ణ, వీఆర్వోలు శ్రీహరి, ఉషాలావణ్య, నాగమ్మ, పేరయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే పొదలకూరులోని అంబేడ్కర్ భవన్ వద్ద భారత్ మహాసేన ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కొప్పోలు చలపతి, విజయ్, బి.చంద్రమౌళి, పి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన్‌లో బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, నారాయణరెడ్డి, పెంచలయ్య, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

కోవూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పడుగుపాడు ఎస్సీకాలనీలో నావూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సాయియశ్వంత్‌రెడ్డి, చిరంజీవి, అంజన్‌రావు, ప్రసాద్, కాటంరెడ్డి దినేష్‌రెడ్డి ఉప సర్పంచ్ అహ్మద్, శ్రీనివాసులురెడ్డి, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట మండలంలో..

ఇందుకూరుపేట: బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఇందుకూరుపేట, కొత్తూరు, మైపాడు, కొరుటూరు, కొమరిక, గంగపట్నం, రాముడుపాళెం, కుడితిపాళెం, పల్లిపాడు, నిడిముసలి, డేవిస్‌పేట, ముదివర్తిపాళెం, జగదేవిపేట తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

విడవలూరులో..

విడవలూరు: బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని విడవలూరు డిగ్రీ కళాశాల, సచివాలయం, అంబేడ్కర్‌నగర్, దంపూరు, దండిగుంట గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



పొదలకూరు: అంబేడ్కర్ భవన్ వద్ద..



కోవూరు: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తూ..



విడవలూరులో..



ఇందుకూరుపేట: మైపాడులో..



పొదలకూరు: విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన్‌లో..